ప్రేమ విలువ

మానవుడి జీవితంలో చాలావరకు ఆపదలకు మూలకారణం 'ఊహ' మాత్రమే అన్నారు పెద్దలు. ఈ భావనాశక్తి, అసలుండ కూడదని అనలేముగాని, తగు మాత్రంగానే ఉండాలని అతిగా వుండకూడదని చాలామంది అభిప్రాయం. తగు మాత్రం అంటే, సుబ్బారావు అనే ఇరవై య్యేళ్ల యువకుడికి, తమ భవిష్యత్తులో చాలా గొప్పవాడినవుతానన నమ్మకంతో బాటు, తనకు కాబోయే భార్య తమ కాలేజీలో మొదటి సంవత్సరం బి. యస్‌సి, చదువుతున్న మంజులత లావుంటుందని, అసలు మంజులతేననీ, మధురమైన భావనలతో పరవశించి అనందించే వరకూ బాగానే వుంటుంది. అసలు యవ్వనంలో ఈభావన చాలాముఖ్యం.

కాని భావనారాయణ అనే ఏభై య్యేళ్ల వ్యక్తికి మాత్రం ఇది చాలా ఆపదలు తెచ్చి పెట్టింది. ఆయన కెంతసేపూ ఎదుటి వ్యక్తి తనని గురించి ఏమనుకుంటూ వుంటాడా? అన్న ఆలోచనా, బహుశా ఈవిధంగా (తరుచూ చెడ్డగానే) అనుకుంటూ వుంటాడనే ఊహ. నిరంతరం బాధిస్తాయి. ఆయన స్థితి పరుడు. పండితుడు. పుస్తకాల షాపు పెట్టుకుని కాలక్షేపం చేస్తున్న, సన్నని పొడుగాటి పెద్దమనిషి. కళ్లజోడు కూడా పెట్తాడు. జీవితంలో ఏలోటులేదు ఆయనికి. కాని పొద్దున్నే కూరగాయ

లమ్మే వాడో, పాలుపోసేవాడో, మరెవడొచ్చినా ఆయనికి, 'వీడు తన గురించి ఏమను కుంటాడా?' అన్న ఆలోచన బాధి స్తూంటుంది. "వంకాయలు వీశ ఆరణాలకిస్తావా?" అని ఆయన అడుగుతే, వాడు "లేదు బాబయ్యా, కిట్టదు అర్ధరూపాయకి తక్కువిన్నాను" అంటే ఆయన, "అయితే నీ వుద్దేశం ఏమిటి? నేనేం తెలివి తక్కువ వాణ్ణినా, బీదవాణ్ణినా, అసలు వంకాయ లంటే ఎలా వుంటాయో తెలియని వాణ్ణినా, ఏమిటి నీ వుద్దే శం?" అని అడుగుతాడు.

దానికి వాడు, "అదేటి బాబయ్యా అలాగంటారు. తమ బోటి మారాజులకు బేరం మాడ్డ మేటనిగాని, వంకాయలే యెరుగరా!" అంటాడు. అలాంటప్పుడు ఆయన కాస్సేపు బేరమాడి కొంటారేగాని, వాడు వెళ్ళి పోయింతరువాత, వాడు తన్ను గూర్చి ఏమన కుంటాడా? అని గంట సేపటి దాకా ఊహిస్తూ కూచుంటారు. ఇహ ఇంట్లో భార్యను చీటికీ, మాటికీ, "ఏమేవ్, నాగురించి నీ ఉదేశమేమటో చెప్పు" అని అడిగి "ఆ, వీడెక్కడ దాపురించాడురా బాబూ, నా పాలిటికి యముడి లాగున్నాడు. అనుకుంటున్నావా? అనుకో, అనుకో" అని అనడం దాని కావిడ, "ఇదేం ఖర్మండీ, మీ గురించి అలా ఎందు కనుకుంటాను" అని ఆవిడ అనడం మామూలు. కాని ఆ జవాబుతో ఆయనకు తృప్తి వుండదు. తీరిక వున్నప్పుడల్లా తన భార్యాబిడ్డలు తనగురించి ఏమను కుంటారా? అని ఆలోచిస్తూనే

వుంటారు అటువంటి భావన్నారాయణగారి పుత్రికా రత్నమే మంజులత.

అసలు మంజులతని సుబ్బారావు ప్రేమించడం ఎలా తటస్థించిందీ అని వాళ్లు డైరీలు గనుక తిరగేసి పరిశీలిస్తే, ఒక కొత్త విషయం మనకు బోధపడుతుంది. అదేమిటంటే సుబ్బారావు తమ్ముడైన కిష్టిగాడు, యస్. యస్. యల్. సి. మూడోసారి కూడా తప్పాక, మెట్రిక్‌కు కట్టించడం కోసం ఆశీర్వాదం మాష్టారితో వాడి గురించి మాట్లాడడానికి సుబ్బారావు బయల్దేరిన రోజే అతని జీవితంలో స్వర్ణాక్షరాలతో లిఖిప బడవలసినరోజు. సుబ్బారావు, ఆశీర్వాదం మేష్టారింటికి రావడమేటి, తక్షణం 'రావోయ్ నీకొక శుభవార్త చెప్తాను" అని మేష్టారనడమేమిటి, వెంటనే సుబ్బారావు మనసులో ఒక ఆనందరేఖ మెరిసింది.

"ఏమిటో త్వరగా చెబుదురూ, చంపక" అన్నాడు సుబ్బారావు, ఆయన కెదురుగా కుర్చీలో కూచుంటూ.

"మన వీధికి ఒక కొత్తకళ వచ్చింది. ఇహనుంచీ మన వీధి బాగు పడుతుంది. మనమంతా ము పటిలా, మాసిన బట్టలూ, పెరిగిన గడ్డం మానేసి, ఇస్త్రీబట్టలు తొడుక్కుని రోజుకోసారి గడ్డం గీసుకోవచ్చు. మునుపు మనవీధిలో అట్టే 'ట్రాఫిక్కు' లేదు. ఇహనుంచీ ఆ బెంగ వుండదు. పదహారేళ్లు దాటిన ప్రతీవ్యక్తీ, తక్కిన వీధులన్నీ మానేసి విధిగా ఈవీధి

వెంట, కనీసం రోజుకు రెండు సార్లయినా తిరుగుతాడు. ఆఖరికి రోడ్లు తుడిచేవాళ్లు కూడా మునుపటి కన్నా శ్రద్ధగా తుడుస్తారు.'' అని ఆశీర్వాదం మేష్టారు చెప్తుంటే సుబ్బారావు కేమీ బోధపడలేదు.

"ఏమిటి మాష్టారూ విశేషం?'' అనడిగాడు తెల్లబోతూ.

నలభై ఏళ్ల ఆశీర్వాదం మాష్టారు సుబ్బారావుని చూసి చిన్న చిరునవ్వు నవ్వారు. అందులో చాలా అర్థముంది. ఇంకా వివరించి చెప్పాలా? అన్న అర్థముంది. కాని, నిరంతరం స్కూల్ ఫైనల్ ఫేలయిన కుర్రాళ్లకు ట్యూషన్ చెప్పడం అలవాటయిన ఆయనకు సుబ్బారావు అజ్ఞానం అంత వింతగా కన్పించలేదు.

"అబ్బాయి, నువ్వీమధ్య బొత్తిగా నీ రూపంగురించి అశ్రద్ధ వహిస్తున్నావు. ఇహనుంచి అదేమి కుదరదు...'' అని ఆయన అంటూండగానే సుబ్బారావు గబుక్కున కుర్చీలోంచి వీధిలోకి ఎగిరాడు. సరిగ్గా అదే సమయంలో ఎదురింట్లో మంజులత మెరిసింది. సన్నగా, నాజుగ్గా పరికిణీ వోణీలో. అందమైన పదహారేళ్ల ఎర్రని మంజులత వెంటనే ఇంట్లోకి మాయమైంది ఆశీర్వాదం మాష్టారు పిలుస్తున్నా వినిపించుకోకుండా సుబ్బారావు తన యింటికి పరిగెత్తాడు. అరగంట తర్వాత స్నో, పౌడర్ల సహాయంతో, బాగా తెల్లబడ్డ సుబ్బారావు అద్దం ఎదురుగా నుంచుని తనజుట్టు దువ్వెన సహాయంతో పాలిష్ చేస్తుంటే, అతని తల్లి "ఒరే కిష్టిగాడి పెళ్ళివేటు సంగతి కనుక్కున్నావురా ?'' అని అడిగింది.

"ఇదుగో వెళ్తున్నా" అని మళ్లీ ఆశీర్వాదం మాస్టా రింటికి పరిగెత్తాడు. అప్పుడు, హోంవర్కు శ్రద్ధగా చేసిన కుర్రాణ్ణి మెచ్చుకున్నట్లు, అతన్ని మెచ్చుకున్నారు మేష్టారు.

కిష్టిగాడి విషయం రెండు నిముషాలలో మాట్లాడడ మయ్యాక సుబ్బారావు ఎదురింట్లో క్రొత్తగా దిగిన భావ నారాయణగారి గురించీ, ఆయన ముద్దులపట్టి మంజులత గురించీ బోలెడన్ని విషయాలు మేష్టారిగారితో చర్చించాడు. ఆ క్షణం నుండి, సుబ్బారావు మంజులతని రోజూ ఒకటి, రెండుసార్లు చూస్తూండడం ప్రారంభించాడు. ఆమె అందం అతన్నాకర్షించింది. ఆమె ఆయేడే స్కూలుఫైనలు పాసయ్యింది. ఆమె మరుసటి సంవత్సరం కాలేజీలో చేరి, పి. యు. సి లో చదువుతూంటే కాలేజీలో పెద్ద అలజడి లేచింది, ఆమె ఆరాధకుల సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిపోయి. కాని వీరిందరి ఆరాధన ఒక ఎత్తు, సుబ్బారావుయొక్క ప్రేమ ఒక ఎత్తు. అతను మంజులతను మనసారా ప్రేమించాడు. ఆమెకోసం ఏ త్యాగమైనా చేయ దల్చుకున్నాడు.

ఒకే వీధిలో ఉండడంవలన సుబ్బారావుకీ, భావ నారాయణగారికీ త్వరలోనే పరిచయం ఏర్పడి అది స్నేహం క్రింద మారింది. తరుచూ సుబ్బారావు, వాళ్లింట్లో కాలం గడప నారంభించాడు. కొన్నాళ్లకి మంజులతతో కూడా అప్పు డప్పుడు మాటాడడం ప్రారంభించాడు. మంజులకి కూడా సుబ్బారావంటే ఇష్టం ఏర్పడింది. సుమారు ఏణ్ణర్థం కష్టపడి,

మంజులత అభిమానం సంపాదించుకొన్న సుబ్బారావుకీ హఠాత్తుగా ఒకనాడు, తన ఆశాసౌధం, గాలిలో అల్లల్లాడుతున్నట్లూ, తను తగిన శ్రద్ధ వహించకపోతే, అది కాస్తా కూలిపోయేటట్లూ, అనుమానం వేసింది. దానికీ కారణం, అదే వీధిలో ఉంటున్న రామరావు అనే యువకుడు.

అసలు రామారావూ, సుబ్బారావూ స్నేహితులు రామారావు చదువు ముగించి, కాలేజీలో ఆయేడే డిమాన్‌స్ట్రేటరుగా చేరాడు. ఎర్రగా, బొద్దుగా ఉన్న ఇరవై రెండేళ్ల యువకుడు. సుబ్బారావు, నల్లగా, పొట్టిగా ఉంటాడు. రామారావు కూడా మంజులతను ప్రేమిస్తున్నాడని సుబ్బారావుకి తెలియదు కానీ రామారావు సుమారు ఏడాదినుండి సుబ్బారావు పడుతున్న అవస్థంతా గమనించి, తను సూక్ష్మంగా, సులభంగా మంజులతను దక్కించుకోవాలని 'ప్లాను' వేస్తున్నాడు. రామారావు, భావనారాయణగారి స్వభావం కనిపెట్టాడు. ఆయనలోని బలహీనత, ఎంతసేపు ఇతరులు తన గురించి, మంచిగా గొప్పగా అనుకోవాలనే కోరిక అనీ, అందువలన తరుచూ ఆయనను పొగిడ్తే ఆయన కిష్టమనీ తెలుసుకున్నాడు. వాళ్లిద్దరూ కలుసుకున్నప్పుడు, భావనారాయణగారు. 'ఓహో రామారావు! రా! కాస్సేపు కూర్చో" అని ఆదరంగా పిలుస్తారు. రామారావు చాలా హుందాగా ఆయన కొట్లోకెళ్ళి కూచుంటాడు. ఒక నిముషం మౌనంగా పరిశీలిస్తాడు.

తరువాత, "అసలు మీ తత్వం చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. బ్రహ్మాండమైన బుద్రకల మీరు, ఇంత చిన్న వ్యాపారంతో తృప్తిపడిపోవడం నాకు నచ్చలేదు. మీరు తెల్చుకోవటం లేదుగాని మీరేగనక తల్చుకుంటే ఎంత వ్యాపారమైనా చేసేసి బోలెడంత డబ్బు గడించగలరు" అని ప్రారంభిస్తాడు రామారావు తీరికగా కూర్చుని.

ఎండి, వాడిపోబోతున్న మొక్కకు నీరుపోస్తే, అది మళ్లీ చిగిర్చినట్లు, ఈ పొగడ్తతో భావనారాయణగారు, వికసించిన మొహంతో, చిరునవ్వుతో "ఆ! నాకంత వోపికేది. అందులోనూ బద్ధకం జాస్తి. అందువలన అలా ఈడ్చేస్తున్నాను. అయితే నీ ఉద్దేశంలో, నాది చాలా గొప్ప మేధాశక్తి అంటావు. అది సరేననుకో. చాలామంది నన్నర్థం చేసుకోలేక తికమక పడిపోతారు. అసలు మా యింట్లో వాళ్ళే నన్నర్థం చేసుకోలేరు" అని ఆయన చెప్తూంటే ఒక ముసలాయన వచ్చి "తిలక్‌గారి గీతారహస్యం ఉందా?" అని అడుగుతాడు. వెంటనే భావనారాయణగారు, గీతారహస్యం తనవద్ద లేకపోయినా, ఆ వచ్చినాయనని పది నిముషాలు నిలబెట్టి తన దగ్గర ఉన్న భక్తి, వేదాంత గ్రంథాలన్నీ చూపించి చివరికి రాజాజీగారి భారతాన్ని అంటగట్టి పంపిస్తాడు ఆ ముసలాడు వెళ్ళిపోగానే రామారావు, "భలేవారండి! మొత్తానికి ఆయనచేత పుస్తకం కొనిపించేశారు" అని ఆయన్ని మళ్ళీ పొగిడి, కాసేపు అలాటి మాటలే చెప్పి వెళ్తాడు. భావనారాయణగారు,

రామారావంత బుద్ధిమంతుడు లేడనే నిర్ణయానికి వచ్చారు. ఆమాట సుబ్బారావుతో అన్నారు కూడాను.

అది విన్న దగ్గర్నుంచీ సుబ్బారావుకి తిండి, నిద్రా పడి పోయాయి. రామారావు ఉద్దేశాన్ని సుబ్బారావు పసిగట్టాడు. భావనారాయణగారికి రామారావుమీద అంత మంచి అభిప్రాయం ఎలా కలిగిందో సుబ్బారావుకి బోధపడలేదు. తనకన్నా రామారావు అందముగాకూడా ఉంటాడు. కానీ, ఈ లోకంలో అందానికి మాత్రమే ప్రాముఖ్యత యిచ్చేటట్లయితే తనలాటి వాళ్ళ గతేంగాను? సృష్ట్యాదినుంచి వస్తున్న శ్వేతజాతి, నల్ల జాతీ అనే ఘోర విచక్షణకు దారుణంగా తన ప్రేమ బలై పోవలసిందేనా! అంతేకాక రామారావు తియ్యగా కబుర్లు చెప్తాడు. ఆ కబుర్ల మాయలో పడి మంజులత కూడా రామారావుమీద ఎక్కువగా శ్రద్ధ చూపిస్తోంది. రెండు రోజుల నుండీ తను వాళ్ళింటికి వెళ్లినప్పుడల్లా, రామారావు గురించే గొప్పగా చెబుతోంది. అతనిచ్చిన బహుమతుల్ని, అంటే ఒక సెల్యులాయిడ్ బొమ్మా, మరో పాలరాతి విగ్రహం, చూపించి "ఎంత బావున్నాయో!" అని మెచ్చుకుంటోంది. తను అంతకు ముందు ఎన్నిసార్లు పిప్పరమెంట్ల పాకెట్లూ, బిస్కట్ల పాకెట్లు ఇచ్చాడో! వాటి ప్రసక్తే మానేసింది. అసలు ఇలా తను కొంత కాలం వూరుకుంటే, రామారావు ఉత్తపుణ్యానికి, మంజులతని పెళ్లాడెయ్యొచ్చు. ఇహ లాభంలేదు. అర్జెంటుగా వెళ్లి ఆశీర్వాదం మాష్టార్ని ఈ విషయంలో సంప్రదించాలి అని నిశ్చయించాడు సుబ్బారావు.

ఆశీర్వాదం మేష్టారు గొప్ప కళాపిపాసి. ఆయన బాగా ప్రయివేటు చెప్తారని, స్కూలుఫైనలు ఫేలయిన కుర్రాళ్ళందరి తల్లిదండ్రులూ తమ పిల్లల్ని ఆయన దగ్గరకే పంపిస్తారు చదువుకోవడానికి. ఆయన చెప్పడం మొదలెడ్తే బాగానే చెప్తారుగాని మధ్యలో సినిమాల ప్రసక్తి వచ్చిందంటే మాత్రం, ఒళ్ళు మరచిపోయి ఆ ధోరణిలో పడిపోతారు. ఆయన నల్లగా, సన్నగా ఉంటారు. నలభై యేళ్లుంటాయి. అక్షరాభ్యాసంతో బాటు సినిమాలుకూడా అభ్యాసం చేసుకున్నట్లు, తన అయిదో ఏటినుంచి వాటిగురించి తెలుసుకోవడం ప్రారంభించారు. కొత్త సినిమా వూళ్లో విడుదలయిందీ అంటే, మాష్టారు ట్యూషన్ మాట అటుంచి, ఆవాళ కుర్రవాళ్ళందరికీ ఆ సినిమా గురించే పాఠం చెప్తారు. ఆయనకు ఒక సినిమా నటి అంటే బ్రహ్మాండమైన అభిమానం. ఆవిడ పాట అద్భుతమనీ, గొంతుక అపూర్వమనీ పొగుడుతారు. "ఆహాహా ! ఏం గొంతుకోయ్ ఆవిడిది ! నభూతో నభవిష్యతి !" అనీ, ఇంకా ఆ పారవశ్యంలో "ఇదిగో సుబ్బారావు! నాకేగనక దేవుడు వరమిస్తే, ఆవిడింట్లో నౌకరుగా పనిప్పించమని కోరుకోనూ. తప్పులేదోయ్ ! అలాంటి వాళ్లింట్లో నౌకరుపని చేసినా తప్పులేదు. మనం పెరట్లో మొక్కలకు నీళ్లు పోస్తూంటే, ఆవిడ ఒకసారి అలా—మేడ మీద నుంచుని ఒక పాట పాడిందంటే, ఒళ్లు పులకరించిపోదూ! ఆహా హా !" అంటూంటారు తన శిష్యపరమాణువైన సుబ్బారావుతో, మై మరచిపోతూ.

సుబ్బారావు, మేష్టారితో, రామారావు యొక్క కుట్రంతా చెప్పేశాడు. తన మిత్రుడే తనను ఘోరంగా మోసం చెయ్యదల్చుకున్నాడనీ, తానీ మోసం భరించలేననీ చెప్పేశాడు. ఆఖరిఛాన్సుగా ఆశీర్వాదం మేష్టారేమైనా సలహా చెప్పి తననీ ఆపదనుంచి గట్టెక్కిస్తే సరేసరి, లేకపోతే తను దేవదాసులా అయిపోతా నన్నాడు. "ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడూ" అని పాడుకుంటూన్న మేష్టారు, సుబ్బారావు మాటలువిని, సీరియస్‌గా మారిపోయారు. "ఏమిటీ, రామారావా? వాడికి మన తెలుగు సినిమా తారలంటే నచ్చవుకదూ! వాడిమొహం. వాడేంపెళ్లాడుతాడు మంజులతని పోదూ" అని మరోపాట పాడుకోబోతూంటే సుబ్బారావు, "అలా అంటే వీల్లేదు. మీరు ఏదో అయిడియా వెయ్యాలి" అని మరీమరీ ప్రార్థించాడు.

"సరే. అయితే పద. కొత్తగా విడుదలయిన తెలుగు పిక్చరొకటి చూసొద్దాం. అయిడియాలు సాధారణంగా సినిమా హాల్లోగాని, నాకుతట్టవు" అన్నారు మేష్టారు. అలాగేనని సుబ్బారావు బయల్దేరాడు ఆయనతో సహా. పిక్చరు చూస్తూన్నంతసేపూ, మేష్టారు అందులో లీనమైపోయారు. కాని, సుబ్బారావు మాత్రం మంజులత తనకు దక్కుతుందో దక్కదో ననే భయంతో పిక్చరు సరిగా చూడలేకపోయాడు. ఆటవదిలి బయటకు రాగానే, మేష్టారు "సుబ్బారావు నువ్వొక ఎంత మాత్రం విచారించకు. నువ్వుమాత్రం పెళ్లికి సిద్ధంగా ఉండు."

అని సుబ్బారావు వీపుమీద గట్టిగా చరిచి, నవ్వుతూ చెప్పారు. దాంతో సుబ్బారావు కెక్కడలేని ధైర్యమూ వచ్చేసింది.

ఎందుకంటే, ఆశీర్వాదం మాష్టారి మాటమీద ఎంత మందికో చాలా గురుంది. ఆయన, 'ఈ యేడు స్కూలుఫైనలు పేపరులో ఈ ప్రశ్నలు పడ్తాయి' అని చెప్పారంటే ఆ ప్రశ్నలు పడితీరాలిసిందే. అసలు ఆ ప్రశ్నలకోసమే అందరూ ఆయన దగ్గర ప్రయివేటు కొస్తారు. సంవత్సరంలో పది నెలలు సినిమా కబుర్లతో కాలక్షేపంచేసి, తక్కిన రెండు నెలలూ గబగబ పిల్లలచేత, తను అనుకున్న ప్రశ్నలకు జవాబులు బట్టీ పట్టించేసే వారు. పరీక్షలో సరిగ్గా ఆ ప్రశ్నలేవచ్చేవి. పిల్లలు పాసయ్యే వాళ్లు. అంత తుపాకి దెబ్బలాగ, పరీక్ష ప్రశ్నలు చెప్పగలిగిన మాష్టారు. మం జులత తనదే అని చెప్పినప్పుడు సుబ్బారావు నమ్మడం సహజమే.

ఆ మర్నాటినుండీ సుబ్బారావులో కా స్తదిగులు తగ్గింది. తను వెళ్తే ముభావంగా పలకరించి లోపలికి వెళ్లిపోతున్న మంజులతను చూసి నిస్పృహం చె దలేదు రామరావు వస్తే, వికసించిన మొహంతో ఆమె ఆహ్వానించడం చూసి కుంగి పోలేదు. నిబ్బరంగా, మంజులత ఏనాటికైనా తనదేననే నమ్మకంతో ఉన్నాడు.

రామారావుని ఒకనాడు భావనారాయణగారు కలిసారు.

"మా అమ్మాయికి నీలాంటి వరుణ్ణిచూసి పెళ్లిచెయ్యాలని ఉందోయ్" అన్నారు నవ్వుతూ.

"దానికేముంది. మా నాన్నగారితో మాట్లాడండి. నాకు పిల్ల నచ్చిందని వాళ్ళతో చెబుతాను" అన్నాడు రామారావు, తన ఆనందాన్ని తనలోనే అణుచుకుంటూ. ఈ మాటకోసమే తను ఇన్నాళ్ళనుండీ ఎదురుచూస్తాడు. "ఈవాళే మీ నాన్న గారితో మాట్లాడుతాను" అన్నాడు భావనారాయణగారు. ఆయన పెళ్ళి విషయం ఇలా కదపడానికి కారణం ఒకవిధంగా ఆశీర్వాదం మేష్టారే. ఆయనే భావనారాయణగారితో మెల్లిగా రెండురోజులు ఈమాటా ఆమాటా చెప్తూ, లోకమంతా భావనారాయణగా రమ్మాయి పెళ్లి ఎప్పుడవుతుందా? అని ఎదురుచూస్తున్నారనీ, తొందరలో ఆమె వివాహం చేయించాలనీ ఆయన బుర్రకెక్కేటట్లు చెప్పారు. అంతేకాదు, "సినిమా స్టారులాంటి మీ అమ్మాయిని, ఆమె అందంచూసి మోజుపడే కుర్రాణ్ణి పెళ్లిచెయ్యండి గాని, కట్నాలూ, గిట్నాలూ కావాలనేవాడి కివ్వకండి" అని సలహా చెప్పారు. ఆ సలహా ఆయనకి బాగా నచ్చింది. వెంటనే, తన యింటిచుట్టూ తిరుగుతున్న రామారావుని అడిగాడు. అతను తన తలిదండ్రుల నడగమనడం జరిగాక ఆరోజు సాయంకాలమే వారి నడగాలని భావనారాయణగారు నిశ్చయించారు.

అదేరోజు ప్రొద్దున్న ఆశీర్వాదం మేష్టారు రామారావు తండ్రయిన కామయ్యగారిని కలుసుకోవడం జరిగింది. ఆయన ప్లీడరు. వయస్సు ఏభై ఏళ్లుంటాయి. కొద్దిగా చాద స్తపుమనిషిలాగుంటారు, పిలకా, నుదుట విభూతిపిండికట్లతో. "ఏమిటి

మేష్టారు విశేషాలు ?" అని ఆయన అడగగానే మేష్టారు చిరు నవ్వుతో "ఆ ఏముందీ పెళ్లికొడుకుల తండ్రులతో వేరే పన్లే ముంటాయి. మనజగ్గారావుగారిమూడో అమ్మాయికిసంబంధాలు చూస్తుంటే వాళ్ళకి కంటికి నదరుగా మీ అబ్బాయి కన్పిం చాడు. నాతో మెల్లిగా ఏమాత్రంలో ఉంటాడోయ్ ? ఆయన" అని అడిగారు.

నేను, "పదివేలకు తక్కువలో లాభంలేదండి అనేశాను"

భేష్. మంచిపనిచేశారు. జగ్గారావుగారు తల్చుకుంటే పదివేలొక లెక్కా. ఈ సంబంధం కుదిరితే మీ మేలు మర్చిపోం".

"దానికేముందిగాని, జగ్గారావుగారి స్వభావం మీకు తెలుసుగా. ఒకటి, రెండువేలు తగ్గినా తగ్గినట్లేనని చూస్తారు. మీరుగాని లొంగితే..." అని మేష్టారు ఆపి, అదోకలా చూశారు. ఆమాట కర్థం గ్రహించి, "అబ్బే! నే నెందుకు లొంగుతాను. అసలు మావాడి 'రేటు' పదివేలు అని ఏనాడో నేను నిర్ణయించేశాను" అన్నారు కచ్చితంగా. అది విని ఆశీర్వాదం మేష్టారు తృప్తిగా ఊపిరి పీల్చారు.

ఆరోజు సాయంకాలం కామయ్యగారితో పెళ్లి విష యాలు మాట్లాడదామని వచ్చారు భావనారాయణగారు. కామయ్యగారు "మావాడికి పదివేలు కట్నం యిస్తామని వస్తు న్నారు. అంతకు పైమాటైతే మాట్లాడండి" అని అనగానే

భావనారాయణగారికి తల తిరిగిపోయింది. వెంటనే సెలవు పుచ్చుకుని ఇంటికి వచ్చేశారు. మంజులత ఈమాట వినగానే నిర్ఘాంతపోయింది కాని ఇది రామారావు అన్నమాట కాదనీ, అతని తండ్రి అన్నమాట అనీ, రామారావు ఆ రాత్రే తండ్రితో దెబ్బలాడి, కట్నంలేని పెళ్ళికి తండ్రిని నప్పిస్తాడనీ, మర్నాడు ప్రొద్దున్నే తమ యింటికి వచ్చి రామారావు చెప్తాడనీ వూహించుకుంది.

కానీ, ఆమె ఎదురుచూసినట్లు ఆ మర్నాడు రామారావు రాలేదు. అసలు రెండు మూడురోజుల దాకా అతని జాడే లేదు. కారణమేమంటే, భావనారాయణగారు పెళ్ళి మాటలాడడానికి వచ్చినరోజు రాత్రే కామయ్యగారు కొడుకుతో, జగ్గారావుగారి సంబంధంమాట చెప్పి, తనకు పదివేలు కట్నం రాబోతోంది గనక, దానిని చెడగొట్టుకునే వెర్రివేషాలేమీ వెయ్యద్దని చెప్పారు. అది విని 'పదివేలే!' అని రామారావు ఆరోజు రాత్రంతా, ఆ పదివేలతోనూ తను పై చదువులకు అమెరికా వెళ్తున్నట్లూ, అక్కడ పెద్దపెద్ద చదువులు చదివినట్లూ కలలు కన్నాడు. మర్నాటినుండి రామారావుయొక్క దృక్పథమే మారిపోయింది. 'తను జీవితంలో పైకి రావలసినవాడు, ప్రపంచంలో డబ్బుకున్న విలువ మరి దేనికీ లేదు. అందువల్ల మంజులత లాటి అందమైన అమ్మాయిల ప్రసక్తి పెట్టుకోకూడదు. వాళ్ళను చూస్తున్నకొద్దీ, అందంకోసం ఏ త్యాగమైనా చెయ్యాలనే బుద్ధివేస్తుంది, అందువల్ల చూడకపోవడమే

మంచిది" అనే నిర్ణయానికి వచ్చి, అతను మరి భావనారాయణ గారి గుమ్మం త్రొక్కలేదు. మళ్ళీ ఆయనతో మాట్లాడలేదు.

నాలుగైదు రోజులు గడిచేసరికి మంజులతకి రామారావు తత్వం తెలిసిపోయింది. తన తండ్రికికూడా కన్పించకుండా మొహం చాటేస్తున్నాడని వినగానే, అతనికి తనయందు నిజమైన ప్రేమ లేదని ఆమెకు బోధపడింది. రామారావుకి కూడా కట్నంయందే కాంక్ష అనీ, తనయందు చూపించిన శ్రద్ధ కేవలం మోసమనీ గ్రహించింది. అసలు మగాళ్ళంతా ఇంతే ననుకుంది.

మరో రెండ్రోజులు పోయాక, సుబ్బారావు మంజులత కోసం ఒక చక్కని బహుమానం తీసుకుని వెళ్లాడు. ఆమె మామూలుగానే ఆహ్వానించింది. "మీ నాన్నగారేరీ ?" అనడిగాడు.

"బజారెళ్లారు" అంది.

"అయితే నే చెప్పదల్చుకున్న ముక్కలు నీకే చెప్పేస్తాను".

"ఏమిటవి ?" అని తన సోగకన్నుల్ని అమాయకంగా పెద్దవిచేసి అడిగింది. సుబ్బారావు ఒక నిముషం ఆమెవైపు చూశాడు. సన్నని నడుమూ, ఎర్రని ఛాయా కల ఆమె విగ్రహంలో, అన్నిటికన్నా సుబ్బారావుకు నచ్చింది, గులాబీ రేకుల్లాంటి ఆమె బుగ్గలు. అవి తను దూరంనుంచి చూస్తున్నా

ఘుమ ఘుమ వాసనలు వెదజల్లుతూ, మెరుస్తూంటాయి. వాటి సోయగం చూస్తూ మైమరచినా, వెంటనే తను వచ్చినపని జ్ఞాపకం వచ్చి, దిగులుగా "ఏం లాభం! భగవంతుడు నాకు అందమివ్వలేదు. రామారావులా పైకి అందంగా కన్పించలేను. కాని, నాకు హృదయముంది. అది నీ పాదాలదగ్గర ఏనాడో పెట్టేశాను. అయినా నీకు నామీద అభిమానం కలుగలేదు. దానికి కారణం నా నల్లనిరూపం. నాకు కట్నా లక్కరలేదు, కానుక లక్కర్లేదు, నీ కడగంటి చూపులు చాలు. నిన్ను దేవతలా ఆరాధిస్తున్నాను. కానీ నీ అనుగ్రహం లేందే మరిక్కడ ఉండలేను. దూరంగా జనసముద్రంలో కలిసిపోతాను. కలకత్తా కాళిని స్మరిస్తూ జీవితాన్ని ముగిస్తాను" అన్నాడు. మంజులత తల వంచుకుని చిరునవ్వు నవ్వుకుంది. సుబ్బారావు నల్లగాఉన్నా అతని హృదయం మంచిది. కట్నంకోసం, తనను వదలుకున్న రామారావు కన్నా ఇతనే వెయ్యిరెట్లు నయం.

"ఏం? కలకత్తాలో ఉద్యోగమైందా?"

"ఆ. మొదట వెళ్ళవద్దనుకున్నాను. కానీ, తరువాత ఇక్కడ మరి ఉండలేననిపిస్తోంది. అందుకని వెళ్లిపోవాలనుకుంటున్నాను".

"నన్నుకూడా తీసికెళ్తారా?" అంది చిలిపిగా మంజులత.

"ఆఁ!" అని ఆమెవేపు చూసి, ఆనందంలో ఉబ్బితబ్బిబ్బయి "నువ్వు వస్తానంటే నాకింక కావలసిం దేముంది!"

అన్నాడు. అప్పుడే ఇంట్లోకి వస్తున్న భావనారాయణగారు, ప్రక్కనే ఉన్న మేష్టారుతో "మీరు చెప్పినట్లు, కట్నం ప్రసక్తే లేకుండా, మా అమ్మాయిని సుబ్బారావు కిచ్చి వెంటనే పెళ్లి చేసేస్తే, నలుగురూ నా సత్తా గ్రహిస్తారు. అసలు నా గురించి మీ ఉద్దేశం ఏమిటో చెప్పండి'' అన్నారు

మేష్టారు నవ్వుతూ "అబ్బో! మీరు అన్నంతపనీ చేసి తీరుతారని నాకు గట్టినమ్మకం ఉందండీ'' అన్నారు.

సుబ్బారావు మంజులతవైపు చూశాడు. ఆమె యింట్లోకి పారిపోయింది. "అయితే ముహూర్తం పెట్టించండి మామ గారూ" అన్నాడు భావనారాయణగారితో.